ప్రజాశక్తి
గురువారం 16 ఏప్రిల్ 2024

పారితోషికాల్లో వ్యత్యాసాన్ని సరిచేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు పారితోషికాల చెల్లింపుల్లో వ్యత్యాసం చూపారని, వెంటనే సవరించి విధుల్లో పాల్గొన్న అందరికీ సమానంగా అందించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో పిఒ, ఎపిఒలకు రూ.1750 చెల్లించారని, కొన్నిచోట్ల ఎపిఒలకు రూ.1250 చెల్లించారని తెలిపారు. రిజర్వ్‌లో ఉన్నవారికి కొన్ని నియోజకవర్గాల్లో వెంటనే చెల్లించగా మరికొన్ని చోట్ల చెల్లింపులు జరగలేదని చెప్పారు. ఉద్యోగులకు మూడు రోజుల శిక్షణ, ఇవిఎం పంపిణీ, రిసెప్షన్‌తో కలుపుకొని ఆరు రోజులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు.



టిడిపిలో గ్రూపుల ప్రభావమెంత?

- అంచనాల్లో టిడిపి తలమునకలు
- సాలూరు, పార్వతీపురం, పాలకొండలో కొరవడిన సహకారం
- కురుపాంలో తెలుగు తమ్ముళ్లలో కనిపించిన ఐక్యత

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎవరు విజేతలో తేలాలంటే మరో 18 రోజులు నిరీక్షణ చేయక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి కంటే టిడిపి బలంగా కనిపించినా గ్రూపు రాజకీయాల కుంపటి గెలుపు అవకాశాలను దెబ్బ తీస్తాయా? అనే చర్చ ఆ పార్టీ నాయకుల్లో జరుగుతోంది. ప్రభుత్వ వ్యతిరేకత, స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ప్రభావం కనిపించినా ప్రతిపక్ష కూటమి నాయకుల మధ్య అంతర్గత విభేదాలు ఏ మేరకు పనిచేశాయన్న చర్చ జరుగుతోంది. పార్టీలో గ్రూపులను కలుపుకుని పోవడంలో విఫలం చెందారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ గ్రూపు రాజకీయాల ప్రభావం అధికారపార్టీ అభ్యర్థులకు లాభిస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. వెన్నుపోటు రాజకీయాల వల్ల మన్యం జిల్లాలో సైకిల్ స్పీడ్‌కి బ్రేకులు పడతాయా? లేదా ప్రభుత్వ వ్యతిరేకతతో గెలుపు అంచున నిలబడతారా? వేచి చూడాల్సిందే.

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపు రాజకీయాలు ఆది నుంచి వెంటాడుతున్నాయి. మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణికి సీటు ఇవ్వొద్దని మొదటి నుంచి వ్యతిరేక గ్రూపు నాయకులు వాదించారు. అభ్యర్థుల ప్రకటనకు రెండు నెలల ముందే పాలకొండ నియోజకవర్గానికి చెందిన ఎస్‌టి మహిళా నాయకురాలు మోజూరు తేజోవతిని మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ గ్రూపు నాయకులు తెరపైకి తెచ్చారు. వీరి వాదాన్ని పట్టించుకోని టిడిపి అధిష్టానం సంధ్యారాణినే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది. గడచిన ఐదేళ్లుగా నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా పని చేసిన సంధ్యారాణికి సీటు ఖరారు కావడం ఆమె వ్యతిరేక గ్రూపు నాయకులకు మింగుడు పడలేదు. అధిష్టానం పెద్దలు కూడా గ్రూపుల మధ్య సమన్వయం కుదర్చే ప్రయత్నాలు పెద్దగా చేయలేదు. మక్కువ మండల సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు, అభ్యర్థి సంధ్యారాణి మధ్య సయోధ్య కుదర్చడానికి విశాఖపట్నంలో టిడిపి అగ్ర నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ సేవలను అభ్యర్థి సంధ్యారాణి పూర్తి స్థాయిలో వినియోగించు కోకపోవడం కనిపించింది. నాలుగు ుండలాల్లోనూ అభ్యర్థి సంధ్యారాణికి కొంత వ్యతిరేక గ్రూపు నాయకులు ఉన్నారు. వారు ఎంతో కొంత మేర సైకిల్ స్పీడ్‌కి బ్రేకులు వేస్తారన్న చర్చ జరుగుతోంది. లేదంటే వీటన్నింటినీ అధిగమించి ప్రభుత్వ వ్యతిరేకతతో సంధ్యారాణి గట్టెక్కుతారా వేచి చూడాలి.

తోయక జగదీశ్వరి (కురుపాం)

బోనెల విజయచంద్ర (పార్వతీపురం)

గుమ్మిడి సంధ్యారాణి (సాలూరు)

నిమ్మక జయకృష్ణ (పాలకొండ)

పార్వతీ పురం నియోజకవర్గంలోనూ టిడిపిని గ్రూపు రాజకీయాలు కనిపించాయి. అభ్యర్థి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపు రెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మధ్య సమన్వయ లోపం పార్టీ విజయావకాశాలను దెబ్బ తీస్తుందనే టాక్ వినిపిస్తోంది. యువకుడు, విద్యావంతుడైన అభ్యర్థి విజయచంద్ర కూడా దూకుడుగా వ్యవహరించడం ఆయన వ్యతిరేక గ్రూపు నాయకులకు మింగుడు పడని అంశంగా మారింది. సిటింగ్ ఎమ్మెల్యే జోగారావుపై నియోజకవర్గ వైసిపిలో బలమైన వ్యతిరేకత ఉన్న కారణంగా ఆయన గెలుపు అంత సులువు కాదనే అభిప్రాయం కూడా ఉంది. అయితే ఈ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో టిడిపి నాయకులు ఎంత వరకూ సఫలీకృతులవుతారో వేచి చూడాల్సిందే.

పాలకొండ నియోజకవర్గంలో కూడా జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గ్రూపు రాజకీయాల తలనొప్పి తప్పలేదని తెలుస్తోంది. టిడిపి నాయకుడైన జయకృష్ణ జనసేనలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని కూడా జనసేన, టిడిపి నాయకులు వ్యతిరేకించారు. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన అభ్యర్థి జయకృష్ణ గట్టి పోటీ ఇచ్చినట్లు పైకి కనిపించినా పార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు వైసిపి అభ్యర్థికి లాభించే అవకాశాలు ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. సాలూరు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సొంత పార్టీ నాయకుల వెన్నుపోటు రాజకీయాలు ఆటంకంగా నిలుస్తాయన్న చర్చ జరుగుతోంది.

కురుపాం నియోజకవర్గంలో మాత్రం టిడిపిలో గ్రూపు రాజకీయాలు ఉన్నా నాయకులు ఐక్యంగా పని చేయడం అభ్యర్థి తోయక జగదీశ్వరికి అనుకూల పరిణామంగా చెప్పొచ్చు. సిటింగ్ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిపై ఉన్న వ్యతిరేకతని కూటమి అభ్యర్థి జగదీశ్వరి సొమ్ము చేసుకోవడంలో విజయవంతం అవుతారని చర్చ జరుగుతోంది. నియోజకవర్గ నాయకులు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, దత్తి లక్ష్మణరావు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు సమన్వయంతో పనిచేయడం వల్ల టిడిపి అభ్యర్థి జగదీశ్వరికి విజయావకాశాలు మెరుగుపడ్డాయనే చర్చ జోరుగా సాగుతోంది. ఏమైనా మన్యం జిల్లాలో టిడిపి అభ్యర్థుల గెలుపు ఓటములపై ఆపార్టీ నాయకులు ఏ మేరకు ప్రభావితం చేస్తారో మరో 18 రోజులు ఆగాల్సిందే మరి.

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

భద్రతా ఏర్పాట్లు తనిఖీ

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్రలో ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూములకు కల్పించిన మూడంచెల భద్రత, బందోబస్తు పరిశీలించారు. మొదటి స్థాయిలో స్థానిక పోలీసులు, రెండో స్థాయిలో రాష్ట్ర సాయుధ బలగాలు, మూడో స్థాయిలో కేంద్ర సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేశారు. రేయింబవళ్లు పహారాతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని భద్రతా అధికారులకు వారు సూచించారు. కార్యక్రమంలో జెసి ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, వర్షం కురిసింది. కొంతమేర ఊరట ఇవ్వడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కురుస్తున్న వర్షం

సీతంపేట చిరుజల్లులు

సీతంపేట : సీతంపేట ఏజెన్సీలో రెండు రోజులుగా కొద్దిపాటి వర్షాలు కురుస్తున్నాయి దీంతో ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతోంది. మధ్యాహ్న సమయంలో ఎండలు అధికంగా ఉండటంతో ప్రజలు వేడిని తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. బుధవారం సాయంత్రం చిరుజల్లులు కురిసి, వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కిశోర్ చంద్రదేవ్‌తో మాట్లాడుతున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.రమణ, నాయకులు కొల్లి గంగునాయుడు

కిశోర్‌తో రమణ భేటీ

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్‌తో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ బుధవారం భేటీ అయ్యారు. ఇండియా కూటమికి కిశోర్ మద్దతిచ్చిన నేపథ్యంలో బుధవారం కురుపాం కోటలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు. కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలు, గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి గంగు నాయుడు పాల్గొన్నారు.

2019 ఫలితాలు పునరావృతం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోను, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2019 ఫలితాలు పునరావృతం అవుతాయని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఎన్నికలు జరగడం సంతోషంగా ఉందన్నారు. అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం తీవ్రంగా శ్రమించారని కితాబు ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీల బెదిరింపులు, కుట్రలను లెక్కచేయకుండా పనిచేశారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి చిత్తశుద్ధిగా పనిచేయడం వల్లే పార్టీకి మంచి పేరు వచ్చిందన్నారు. ఆయన్ని ప్రజలు బలంగా నమ్మడం కనిపించిందని తెలిపారు. ఆయనపై ఉన్న నమ్మకంతో పెద్ద ఎత్తున పాల్గొని, ఓటు వేశారని తెలిపారు. విజయనగరం జిల్లాలో అర్ధరాత్రి 3 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెరగడం మరో శుభపరిణామమని తెలిపారు. పెరిగిన పోలింగ్ శాతంతో వైసిపికి కలిసి వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు నెక్కల నాయుడుబాబు, కెవి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే

కఠిన చర్యలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని పార్వతీపురం రూరల్ సిఐ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రజలు సహకరించి ఎలాంటి సంఘటనలు జరగకుండా విజయవంతం చేశారని తెలిపారు. అందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 4న జరిగే ఎన్నికల లెక్కింపు వరకు ఇదే సహకారాన్ని ప్రజలు కొనసాగించాలని, పోలీసులతో సహకరించాలని కోరారు.

సీతానగరం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వరకు గ్రామాలలో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఎస్‌ఐ ఎం.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

హైస్కూల్ ప్లస్ సరే.. బోధకులేరీ?

- వసతులూ కరువు
- ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 1 నుంచే తరగతులు ప్రారంభించాలని ఆదేశం

సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం మార్చింది. కానీ అందుకు తగ్గట్టు బోధకులను నియమించడం, వసతులు కల్పించడంపై దృష్టిసారించడం మరిచింది. ఓవైపు ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ కూడా ప్రారంభించారు. మరో 15 రోజుల్లో తరగతులు కూడా ఆరంభించేందుకు సిద్ధమవుతున్నారు. అధ్యాపకుల నియామకాన్ని విస్మరించారు. ఇంటర్ బోధనకు అనుగుణంగా ల్యాబ్‌ల ఏర్పాటు, ఇతర సౌకర్యాల కల్పనపై నేటికీ దృష్టిపెట్టలేదు. విద్యాశాఖ అధికారుల ముందుచూపు లేని నిర్ణయాలతో ఎక్కడ తమ పిల్లలకు సరైన విద్య అందదోనని తల్లిదండ్రులు.. ఆ కళాశాలలో చేర్పించేందుకు సందేహిస్తున్నారు.

ప్రజాశక్తి-సీతంపేట

ఇదే నూతన హై స్కూల్ ప్లస్ కళాశాల

సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్ అప్‌గ్రేడ్ చేస్తూ 2023లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఏడాది జూన్ ఒకటో తేది నుంచి కళాశాల ప్రారంభించాలని నిర్ణయించింది. అధికారులకు సర్క్యులర్ జారీ చేసింది. కో ఎడ్యుకేషన్ కళాశాలలో ప్రవేశాలకు ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. బైపిసి, ఎంపిసి, సిఇసి గ్రూపులు కేటాయించారు. విద్యార్థులు ఏ గ్రూపుల వైపు మొగ్గుచూపుతారో ఆ రెండు గ్రూపులు మాత్రమే నిర్వహిస్తామని, మిగతా గ్రూపు తొలగిస్తామని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. హై స్కూల్ ప్లస్‌లో బోధించడానికి పాఠశాల నుంచి అర్హత ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. దానికి సంబంధించి ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు,

హైస్కూల్ ఉపాధ్యాయులను కేటాయిస్తారా, లేదా ప్రత్యేకంగా పిజిటి ఉపాధ్యాయులను మంజూరు చేస్తారా? అనే సందిగ్ధంలో విద్యార్థులు , ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతోపాటు ఎంపిసి, బైపిసి గ్రూపులు ఏర్పాటుచేస్తే, ల్యాబులు తప్పనిసరి. ఇంతవరకూ అవేవీ ఏర్పాటుచేయలేదు. టేబుళ్లు, బెంచీలు కూడా లేవు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు సరిపడా గదులు ఉన్నాయి. వంరుగుదొడ్ల మాత్రం చాలీచాలనివి ఉన్నాయి. ఇప్పుడు కళాశాలగా అప్‌గ్రేడ్ అయ్యాక ఒక్కో గ్రూపు నుంచి 40 మంది చొప్పున రెండు గ్రూపులకు 80 మంది విద్యార్థులు కొత్తగా చేరుతారు. అందుకు సరిపడా మరుగుదొడ్లు, వసతులు లేవు. ఇంకా కళాశాల ప్రారంభించడానికి 15 రోజులు మాత్రమే ఉంది. ఈ కాలంలో బోధకులు, బోధనేత సిబ్బంది, అదనపు గదులు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు.. ఏర్పాటు సాధ్యమవుతుందా? అధికారులు పూర్తిచేయగలరా? అని విద్యార్థులు, తల్లిదండ్రులు సందేహ పడుతున్నారు.

అర్ధాంతంగా నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు

సీతంపేటలో జూనియర్ కళాశాల లేదు. దానికి తోడు ఈ కళాశాల మంజూరు చేయడం వల్ల మరింత డిమాండ్ పెరుగుతుంది. మండలంలో ఈ ఏడాది గురుకులాలు, ఆశ్రమ ఉన్నత పాఠశాలల నుంచి దాదాపు రెండు వేల మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత చెందారు. కళాశాల ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమసుందర్ వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా ఈ నెల 25వ తేదీకి పిజిటి బోధకులను నియమిస్తారని చెప్పారు. జూన్ ఒకటో తేదీ నుంచి హైస్కూల్ ప్లస్ క్లాసులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ నెల 15వ తేదీ కల్లా విద్యార్థుల ప్రవేశాలు జాబితా విద్యా శాఖకు పంపిస్తామని వెల్లడించారు. ఇప్పటికే 27 మంది విద్యార్థులను అడ్మిషన్లు జరిగాయని తెలిపారు.

అంగన్వాడీ, ఆశాలకు ఎన్నికల అలవెన్సులు ఏవీ?

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా విధుల్లో పాల్గొన్న హెల్త్ సిబ్బందికి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు అలవెన్స్ లభించలేదు. ఉదయం మాక్‌పోల్‌నుంచి పోలింగ్‌పూర్తయిన అర్ధరాత్రి వరకూ విధులు నిర్వహించిన వీరికి ఉత్తిచేయే చూపించారు.

పోలింగ్‌కు ముందే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఐసిడిఎస్ పీడీని కలిసి అధికారికంగా డ్యూటీలు వేసి వారందరికీ ఎన్నికల అలవెన్స్‌లు ఇవ్వాలని ముందుగానే కోరారు. కానీ అధికారులు అధికారికంగా ఆదేశాలు ఇవ్వకుండా ఫోన్‌సమాచారం ద్వారా పోలింగ్ విధులు నిర్వహించాలని ఆశ, అంగన్వాడీ వర్కర్లకు సమాచారం ఇచ్చారు. దీంతో విజయనగరం జిల్లాలోని 4400మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, 1785 మంది ఆశావర్కర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 3160 మంది అంగన్వాడీలు, 1470 మంది ఆశావర్కర్లు 1530 మంది సిహెచ్ డబ్ల్యులు విధులు నిర్వహించారు. అంగన్‌వాడీలకు అధికారంగానే డ్యూటీలు వేశారు.

వీరంతా పోలింగ్ కేంద్రాల వద్ద ఆశా వర్కర్లకు, అర్బన్ పిహెచ్‌సిల్లో పని చేసే సెకండ్ ఎఎన్‌ఎంలకు డ్యూటీలు వేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైన మాక్ పోలింగ్ నుండి సాధారణ పోలింగ్ పూర్తయిన అర్ధరాత్రి వరకూ కేంద్రాల వద్ద హెల్త్ సిబ్బందితో కలిసి విధులు నిర్వర్తించారు. ఇతర సిబ్బంది అందరికీ అలవెన్స్ అందిస్తున్న అధికారులు ఆశాలకు, అంగన్వాడీలకు మాత్రం మొండిచేయి చూపారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సేవలందించిన తమకు అలవెన్స్ ఎగ్గొట్టడం దారుణమని వారంతా ఆవేదన చెందుతున్నారు. చాలా పోలింగ్ కేంద్రాల వద్ద వద్ధులు, మహిళలు ఎండ వేడిమి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయారు. వారికి ఆశాలు ఒఆర్ఎస్ ప్యాకెట్లు కలిపి అందజేశారు. చంటి పిల్లలతో వచ్చిన ఓటర్లు ఓటు వేసి వచ్చినంత వరకు అంగన్వాడీలు ఆ పిల్లల ఆలనా పాలనా చూశారు. భోగాపురం, గుర్ల, కొత్తవలస, రాజాం, వీరఘట్టం, భోగాపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, విజయనగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరిగింది. అప్పటివరకూ వీరంతా ఇవిఎంలతో సిబ్బంది బస్సులో బయల్దేరి వరకూ అక్కడే విధులు నిర్వర్తించారు. కానీ వీరి సేవలను అధికారులు గుర్తించలేదు. 2019 ఎన్నికల్లో ఆశాలకు కూడా పోలింగ్ డ్యూటీ వేసి అలవెన్స్ అందించారు. ఈసారి ఎన్నికల్లో డ్యూటీ చేసిన వారికి పారితోషికం ఇవ్వకపోవడాన్ని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి ఖండించారు. నేరుగా డ్యూటీ వేయకుండా మెడికల్ క్యాంపు పేరుతో పోలింగ్ పూర్తయ్యే వరకూ డ్యూటీ చేయించి అలవెన్సు ఇవ్వకపోవడం అన్యాయమని, వారందరికీ వెంటనే అలవెన్సు చెల్లించాలని అధికారులను కోరారు.

మహిళలు, యువత ఓట్లే కీలకం

సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మహిళలు, యువత పాత్ర అత్యంత కీలకంగా ఉండబోతుంది. ముఖ్యంగా మహిళా ఓటర్లు తీవ్ర ప్రభావం చూపనున్నారు. మహిళా ఓటర్లలో ఎక్కువ మంది తమకే సహకరంచారని వైసిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తుండగా, యువత మొత్తం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, టిడిపి అనుకూలంగా ఓట్లు వేశారని టిడిపి అంచనాలు వేస్తోంది. దీనికితోడు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు టిడిపి అనుకూలంగాను, వైసిపికి వ్యతిరేకంగా ఉంటాయని ఇరు పార్టీల నాయకులు అంగీకరిస్తున్నారు. మరోవైపు గ్రామాలు, వార్డుల వారీగా, బూత్ నెంబర్ల వారీగా టిడిపి, వైసిపి నాయకులు అంచనాల వేసుకోవడంలో బిజీబిజీగా మారారు. మంగళ, బుధవారాలో ఇటువంటి సమావేశాలు, సమీక్షలతో ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు తలమునకలయ్యారు. టిడిపి అభ్యర్థులు తామే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తుండగా, స్వల్ప మెజార్టీతోనైనా గట్టెక్కిపోతామని వైసిపి అభ్యర్థులు, వారి అనుయాయులు అంచనాలు వేస్తున్నారు.

- పోస్టల్ బ్యాలెట్ ఓట్లన్నీ తమవేనన్న టిడిపి
- మహిళలు తమకే సహకరించారన్న వైసిపి
- గ్రామాల వారీగా లెక్కలు
- కూడికలు, తీసివేతల్లో నాయకులు బిజీబిజీ
- అందరిలోనూ గెలుపు ధీమా

ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పోలింగ్ సరళిని ఒక్కసారి పరిశీలిస్తే విజయనగరం జిల్లాలో మొత్తం 15,62,921 ఓట్లు ఉండగా, 12,71,173 ఓట్లు పోలయ్యాయి. 2,91,748 మంది ఓటర్లు తమ హక్కును ఉపయోగించుకోలేదు. 18ఏళ్ల నుంచి 19ఏళ్లలోపు వయసుగల ఓటర్లు 39,612 మంది ఉన్నారు. వీరంతా తొలిసారిగా ఓటు హక్కుపొందిన విద్యార్థులు. వీరిలో చాలా వరకు జనసేన అభిమానులు, మిగిలినవారిలో టిడిపి, వైసిపిలకు చెరుసగం ఉంటారని అంచనా. ఈ లెక్కన 19ఏళ్లలోపుగల ఓటర్లంతా కూటమికి ఓట్లువేసి ఉండవచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 20 నుంచి 29ఏళ్లలోపు వయసుగల ఓటర్లు 2,45,813 మంది ఓటర్లు వరకు ఉన్నారు. వీరిలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు కూడా ఉన్నారు. సాధారణంగా ఉద్యోగులు, నిరుద్యోగుల్లో వైసిపి ప్రభుత్వంపై గడిచిన కొంతకాలంగా వ్యతిరేకత వ్యక్తమైంది. జిల్లాలో 18,869 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. ఇతర జిల్లాల నుంచి మరో 2,773 బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. వీరంతా ఉద్యోగులే. ఉద్యోగులంతా తమవైపే ఉన్నారని టిడిపి బలంగా చెబుతోంది. అటు వైసిపి నాయకులు కూడా వీరి ఓట్లను అంతగా లెక్కపెట్టడం లేదు. అత్యధికంగా విజయనగరం అసెంబ్లీ పరిధిలో 4,201 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాయ కుల్లో గుబులు, టిడిపి నాయకుల్లో జోష్ కనిపిస్తోంది. ఇక మహిళా ఓటర్ల సరళిని ఒక్కసారి పరిశీలిస్తే.... జిల్లాలో మొత్తంగా 7,92,038 మంది మహిళా ఓటర్లు ఉండగా, వారిలో 6,44,844 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు మొత్తం 7,70,805 మంది ఓటర్లు కాగా, 6,26,307 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు కన్నా మహిళా ఓటర్లు 21,233 మంది అధికంగా ఉండగా, పోలైన ఓట్లలో పురుషులకన్నా 18,537 మహిళా ఓట్లు అధికంగా ఉన్నాయి. దీన్నిబట్టి మహిళా ఓట్లు కొంతమేర ఎన్నికల్లో ప్రభావితం చూపుతాయి. ప్రధానంగా టిడిపికూటమి మేనిఫెస్టోలో ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, బస్సు ప్రయాణం వంటి పథకాలు మహిళలను ఆకర్షించాయని చర్చ జరుగుతోంది. అదే సందర్భంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ఎక్కువ శాతం మహిళల పేరునే మంజూరు చేయడం, వాటిలోనూ చేయూత, ఆసరా వంటి పథకాలతో తమకే ఓట్లు పడతాయని వైసిపి నాయకులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇళ్ల పట్టాలు, డ్వాక్రా రుణాలు మాఫీ, చేయూత, అమ్మఒడి, విద్యాదీవెన తదితర పథకాలు మంచి మహిళలను ఆకర్షించాయనడంలో సందేహం లేదు. కానీ, ఈ పథకాలేవీ స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయలేదు. దీనికితోడు వీరు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసినప్పుడు ప్రభుత్వం అరెస్టులు, నిర్బంధాలు, భయోత్పాతాలకు పాల్పడడం వల్ల మహిళా ఓటర్లలోనూ చీలిక ఉంటుందని కూడా మరో విశ్లేషణ ఉంది. వలస ఓటర్లలో ఎక్కువ శాతం ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా ఉండే అవకాశం ఉంటుందని రాజకీయ నాయకులు అంచనాలు వేస్తున్నారు. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత కూడా వైసిపికి కొంత ప్రతికూల ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఇటువంటి చోట గతంలో టిడిపి తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులపై సానుభూతి కూడా కనిపిస్తోంది. రైతు భరోసా పథకం, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా వైసిపి ప్రభుత్వం రైతు కుటుంబాలకు చాలా వరకు దగ్గరైనప్పటికీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై టిడిపి చేసిన ప్రచారం ఆ తరగతిలోని వైసిపి ఓట్లను చాలా వరకు చీల్చే అవకాశం కూడా లేకపోలేదు. మద్యం ధరల పెంపుతోపాటు బ్రాండ్ల మార్పు, నాసిరకం లిక్కర్ అందుబాటులో ఉంచడం వంటివాటిపై మందుబాబులు ప్రతికూల తీర్పును ఇచ్చి ఉండవచ్చేమో అన్న చర్చనడుస్తోంది. ఈనేపథ్యంలో వైసిపి నాయకులు బయటకు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ లోలోపల భయం కనిపిస్తోంది.



పోలైన ఓట్లను పరిశీలిస్తే..

	మొత్తం ఓట్లు	పోలైనవి
మహిళలు	7,92, 038	6,44,844
పురుషులు	7,70,805	6,26,307

అధ్వానంగా కాలువలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. చెత్తబుట్టల్లో వేయాల్సిన వ్యర్థాలను కాలువలో వేయడం వల్ల మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యపై మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి షాపుల వద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయడంతోపాటు వాటి వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చెబుతున్నారు. నిబంధనలు అతిక్రమించే వారి నుండి అపరాధ రుసుం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలువలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, చెత్త

రోడ్డుపైకి చేరిన మురుగునీరు

రోడ్డుపైకి మురుగునీరు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని ఒకటో వార్డులో స్వీపర్‌వీధిలో రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించలేదు. దీంతో నివాసాల నుంచి వచ్చే నీరు రోడ్డుపై నిలిచి పోతోంది. ఆ రహదారిపై రాకపోకలు సాగించే పాదచారులతో పాటు స్వీపర్ వీధిలో నివాసం ఉంటున్న మున్సిపల్ కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. మంగళ వారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షంతో బురదంతా రోడ్డుపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్నా, తాము నివసించే వార్డులో కనీస మౌలిక సదుపాయాల కల్పించే ందుకు అటు మున్సిపల్ అధికారులు గానీ, ఇటు పాలకవర్గ సభ్యులు గానీ చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. తమ వార్డులో కాలువలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని బాలగుడబ గ్రామంలో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.నారాయణ బుధవారం తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణులకు గడువులోపు టీకాలు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్ పరిమితి చూసి సకాలంలో టీకాలు వేయాలన్నారు. గ్రామంలో టీకాలు పూర్తయిన వెంటనే రికార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, నాగమ్మ ఎఎన్ఎం రామలక్ష్మి, సిహెచ్ఒ జగదీష్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూమి సారవంతం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయం డిపిఎం పి.షణ్ముఖరావు తెలిపారు. మండలంలోని సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో వేసుకోవడానికి సిద్ధంగా ఉంచిన నవధాన్యాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నవధాన్యాల సాగువల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వరి, రాగి వేసే రైతులు శ్రీ పద్ధతిలో వేసుకోవడం వల్ల అదిక దిగుబడులు సాధించడానికి ఆస్కారం కలుగుతుందని చెప్పారు. వరి గట్టులపై చిక్కుడు, బెండ, బీర, బంతి వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌ఛార్జి వి.పోలినాయుడు, బి.ధనుంజయ, ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

డిఎస్‌పి నాయక్‌ను సన్మానిస్తున్న సిఐ సత్యనారాయణ

ఆర్‌పిఎఫ్ డిఎస్‌పికి సన్మానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్న ఆర్‌పిఎఫ్ డిఎస్‌పి కె.సి.నాయక్, సిబ్బందిని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో గొడవలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి తమతో పాటు కృషిచేసిన ఆర్‌పిఎఫ్ డిఎస్‌పి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలుగా తమ సిబ్బందితో కలిసి ప్రతి విషయంలో అందుబాటులో ఉంటూ సేవలందించారని చెప్పారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్, ఆర్‌పిఎఫ్ సిఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్పా వీధిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని రెండో సచివాలయ పరిధిలోనే కస్పా వీధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శాంతకుమారి, ఎంఎల్‌హెచ్ పి కావ్య, ఎఎన్ఎం జానకి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని శివరాంపురం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ (40) బుధవారం గుండెపోటుతో మరణించారు. బుధవారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో రామభద్రపురంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకులు ఎ.ప్రవీణ్ కుమార్, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, వైసిపి మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

రాజశేఖర్ (ఫైల్)

బస్సును ఢీకొన్న టిప్పర్

తీవ్రంగా గాయపడిన డ్రైవర్

సెంచూరియన్ బస్సును ఢీకొన్న టిప్పర్

● 8 మంది విద్యార్థులకు గాయాలు ● ఓ విద్యార్థినికి విరిగిన కాలు ● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్

ప్రజాశక్తి-బొండపల్లి

మండల కేంద్రమైన బొండపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సెంచూరియన్ యూనివర్శిటీకి చెందిన బస్సును ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది విద్యార్థులకు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వారిలో ఒక విద్యార్థినికి కాలు విరిగిపోయింది. గజపతినగరం నుంచి నెలిమర్ల మండలం చందకపేట వద్ద ఉన్న సెంచూరియన్ యునివర్సిటీకి విద్యార్థులను తీసుకువెళ్తున్న బస్సును గజపతినగరం వైపు ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ అదుపు తప్పి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది విద్యార్థులకు గాయాలు కాగా వీరిలో లోగిస గ్రామానికి చెందిన వసంత కుమారికి కాలు విరిగిపోయింది. వెంటనే స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను గజపతినగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విజయనగరంలోని ఓ ప్రైవేటుఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ ప్రమాదంలో బస్సును నడుపుతున్న డ్రైవర్ కృష్ణంరాజు క్యాబిన్ లో ఇరుక్కుపోవడం తో కట్టర్‌తో రాడ్‌లను కట్ చేసి ఆయనను బయటకు తీశారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన విద్యార్థినులు

సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంఒ జగన్మోహన్ రావు

గిరిశిఖర గ్రామాల్లో దోమలమందు పిచికారీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన గ్రామాలైన కీసరి, కీసరిగూడలో బుధవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ ప్రక్రియను జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్మోహనరావు పరిశీలించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలు, వీధి కాలువలు, బోర్ల వద్ద దోమల మందు పిచికారీ చేయించుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయన సూచించారు. బుధవారం నుంచి జిల్లాలో ప్రారంభమైన మొదటి దశ దోమల మందు స్ప్రేయింగ్‌ను ఆయన పరిశీలించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ దోమల మందును సక్రమంగా పిచికారీ చేస్తున్నదీ, లేనిదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దోమల సంహారిణి ఎసిఎమ్ రసాయనం కలిపే మోతాదు, స్ప్రే చేసిన గదులు మొదలైన వివరాలపై సిబ్బందిని ఆరాతీశారు. స్ప్రేయింగ్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. స్ప్రే జరిగిన ఇళ్లకు ఆరోగ్య శాఖ నిర్దేశించిన విధంగా వేసిన మార్కింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు స్ప్రేయింగ్ ఆవశ్యకతను ఆయన వివరించారు. దోమతెరల వినియోగంపై అవగాహన కలిగించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంఒ డి.సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మోహన రావు, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మి, మలేరియా సాంకేతిక సూపర్వైజర్ అప్పల నాయుడు, సూపర్వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రాధాకృష్ణ, ఎఎన్ఎం ప్రభావతి పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఓట్ల పండగ ముగిసింది. ఇక ప్రజాతీర్పే మిగిలింది. మరో 18 రోజులు తీర్పు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి అవిశ్రాంతంగా పనిచేసిన రాజకీయ పార్టీల నేతలు, అధికారులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. పోలింగ్ ముగియడంతో ఓటింగ్ సరళిపై నాయకులంతా లెక్కల్లో మునిగి తేలారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, అనుకూల, ప్రతికూల ఓట్లపైనా ఆరా తీస్తున్నారు. కూడికలు, తీసివేతలతో ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నువ్వా నేనా అన్నట్లు సాగిన అధికార వైసిపి, టిడిపి కూటమి పోరులో విజయం ఎవదరిదనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఇక ఎన్నడూ లేనంతగా నియోజకవర్గంలో 71.84 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 19,672 ఓట్లు, పోస్టల్‌బ్యాలెట్ 4201 ఓట్లు అదనంగా పోలయ్యాయి. పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికల్లో చెదురుమదరు ఘటనలు మినహా నియోజకవర్గంలో 260 కేంద్రాల్లో అంతటా ప్రశాంతంగా జరిగింది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి 11 గంటల వరకు నిరీక్షించి మరీ ఓటర్లు ఓటేశారు. అసెంబ్లీకి 15 మంది పోటీచేశారు. అయితే ప్రధానంగా అధికార వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి, టిడిపి అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, స్వతంత్ర అభ్యర్థి మీసాల గీత మధ్య పోటీ నెలకొంది. గతంలో పోలిస్తే పెరిగిన ఓట్లతో తమకే అనుకూలిస్తుందని అభ్యర్థులు వరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాము అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని అధికార పార్టీ నేతలు చెబుతుండగా, వైసిపి ప్రభుత్వ అవినీతి, దౌర్జన్యం సహించలేక ఓటర్లు తమవైపే మొగ్గుచూపారంటూ ఎన్‌డి కూటమి అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. నియోజకవర్గంలో పెరిగిన ఓటింగ్ శాతం తమదేనని, ఖచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక కోలగట్ల వీరభద్రస్వామి విజయం తమదేనని ధీమాగా ఉన్నారు. ఇండియా కూటమి నుంచి సుంకరి సతీష్ సైతం ఓటింగ్ సరళిని అంచనా వేసి ఎన్ని ఓట్లు వస్తాయని అంచనా వేసుకునే పనిలో ఉన్నారు. అయితే విజయం ఎవరిదో వచ్చేనెల 4వరకు వేచి ఉండాల్సిందే.

కోలగట్ల వీరభద్రస్వామి

అదితి గజపతిరాజు

శ్రీసాయి డిగ్రీ కళాశాలలో నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక విద్యుత్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిఎస్సి కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, బి.టెక్ కెమికల్, ఎమ్మెస్సి కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసి 21 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువకులు అర్హులన్నారు. వేతనం రూ.18వేలు నుంచి 24వేలు వరకు ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 9గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు.

18న నెల్లిమర్ల మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 18న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రామారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఎంపిపి అంబళ్ల సుధారాణి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు, తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశంపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికార్లు హాజరు కావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

నీలమాంబపురంలో చోరీ

8 తులాల బంగారం, 5 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని ఇటిక పంచాయతీ నీలమాంబపురం గ్రామానికి చెందిన పురోహితుడు కర్రి సతీష్ ఇంటిలో చోరీ జరిగింది. ఈనెల 10న తన మేనమామ మృతిచెందడంతో సతీష్ కుటుంబ సమేతంగా రంపచోడవరం వెళ్లారు. 13న ఓటు వేసేందుకు సతీష్ వచ్చి చూడగా ఇంటి తాళం తీసి ఉంది. బీరువా తాళం విరగ్గొట్టి ఎనిమిది తులాల బంగారం, సుమారు 5 లక్షల పైబడి నగదు చోరీకి గురైనట్లు జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్లో ఆయన ఫిర్యాదుచేశారు. ఎస్ఐ పి.అనిష్ కేసు నమోదు చేశారు. బుధవారం పాలకొండ డిఎస్‌పి జి.వి కృష్ణారావు, చినమేరంగి సిఐ మంగరాజు గ్రామానికి చేరుకుని, దర్యాప్తు చేశారు. క్లూస్‌టీమ్ వివరాలు సేకరించింది.

చోరీకి గురైన కాశీపట్నం ఆర్‌బికె

కాశీపట్నం ఆర్‌బికెలో చోరీ

కంప్యూటర్లు, టీవీ ఎత్తుకెళ్లిన దొంగలు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని కాశీపట్నం సచివాలయ పరిధిలో ఉన్న ఆర్‌బికెలో దొంగలు చొరబడి కంప్యూటర్లు, స్మార్ట్‌టీవీని ఎత్తుకుపోయారు. ఎన్నికల తర్వాత విధుల్లోకి వెళ్లిన ఉద్యోగులకు కంప్యూటర్ లేని విషయాన్ని గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదును అందజేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.